సర్కారు బడి... సమస్యల ఒడి

- నిలిచిన నాడు–నేడు పనులు
- నిధులను విడుదల చేయని ప్రభుత్వం




మట్టిమసీదు ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఒకే తరగతి గదిలో అన్ని తరగతుల విద్యార్థులు, మీసీ బాలికల హైస్కూల్‌లో పూర్తికాని అదనపు తరగతి గదులు

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు, వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. గత ప్రభుత్వం మన బడి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తగ్గని విధంగా అభివృద్ధి చేసి, జగనన్న గోరుముద్ద ద్వారా మంచి పౌష్టికాహారాన్ని అందించింది. తెలుగు దేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాభివృద్ధికి ఏమాత్రం చొరవ చూపడం లేదు. ప్రొద్దుటూరు మండలంలో 110 ప్రభుత్వ మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్, జిల్లాపరిషత్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 82 ప్రాథమిక పాఠశాలలు, 9 ప్రాథమికోన్నత పాఠశాలలు, 21 ఉన్నత పాఠశాలు ఉన్నాయి. వీటిలో దాదాపు 14,365 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నాడు–నేడు కింద గత ప్రభుత్వం రూ.9.80 కోట్లను మంజూరు చేసి 38 పాఠశాలను అభివృద్ధి చేసింది. అలాగే రెండవ విడతగా 67 పాఠశాలల్లో అదనపు తరగతుల నిర్మాణం కోసం రూ.22.9 కోట్లను కేటాయించి విద్యావ్యవస్థను పటిష్టపరించింది. ప్రభుత్వం మారిన తరువాత మిగిలిన పనులను పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయక పోవడంతో 11 పాఠశాలల్లో నాడు–నేడు పనులు పూర్తికాలేదు. గదుల నిర్మాణం పూర్తయినా ఎలక్ట్రికల్ వర్క్స్, తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్ పనులు నిలిచి పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

అరకొరగా విద్యాకానుక:

మండలంలోని 14,022 మంది విద్యార్థులకు విద్యా కానుకను అందజేశారు. 1,17,816 పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. 1965 పాఠ్యపుస్తకాల సరఫరా కోసం ఇండెంట్ పంపారు. అలాగే కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సక్రమంగా వడ్డించక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బంది:

చాలా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు సరిపడ ఉపాధ్యాయులు లేరు. ఉన్న ఉపాధ్యాయులతోనే అదనపు తరగతులు నిర్వహించి విద్యార్థులకు బోధన చేయిస్తున్నారు. అలాగే మండలంలో 14 పాఠశాలల్లో ఒకరే ఉపాధ్యాయులు ఉన్నారు. అన్ని తరగతుల విద్యార్థులను ఒకే చోట కూర్చోపెట్టి విద్యాబోధన చేస్తున్నారు. మండల విద్యాశాఖాధికారి వేరొక ఉపాధ్యాయులను కేటాయించినప్పుడు మాత్రమే సెలవుపై వెళ్లాల్సి వస్తోంది. కాగా మండలంలో 638 మంది ఉపాధ్యాలు ఉండగా ఇటీవల దాదాపు 18 మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ చేశారు. దీంతో కొన్ని పాఠశాల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. వేరొక పాఠశాలల నుంచి డిప్యూటేషన్ ద్వారా ఉపాధ్యాయులను నియమించి విద్యాబోధన చేయిస్తున్నారు.

గదుల నిర్మాణాలను పూర్తి చేస్తాం



రెండవ విడత నాడు–నేడు పనులకు సంబంధించి గదుల నిర్మాణాలను నిధులు మంజూరు కాగానే త్వరలో పూర్తి చేస్తాం. ఉపాధ్యాయుల కొరత లేకుండా అన్ని పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేశాం. ఉపాధ్యాయులు లేని చోట డిప్యూటేషన్ ద్వారా ఉపాధ్యాయులను పంపి విద్యాబోధన చేయిస్తున్నాం.

– సావిత్రమ్మ, ఎంఈఓ, ప్రొద్దుటూరు

రెడ్ల సంక్షేమానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న రఘురామిరెడ్డి

ఖాజీపేట: పార్టీలకు అతీతంగా రెడ్ల సంక్షేమం కోసం అందరూ కలసికట్టుగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. ఖాజీపేట మండలం నాగనాథేశ్వర స్వామి ఆలయం దిగువన రెడ్ల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంతోపాటు కార్తీక మాస వనభోజన కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్లలో పేదలు ఉన్నారని వారి సంక్షేమం కోసం అందరూ కృషి చేయాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రెడ్లదే ఆధిపత్యం అని గ్రహించి కొందరు పన్నిన కుటిల రాజక్రీయ క్రీడలో రాష్ట్రం విడిపోవాల్సి వచ్చిందని తెలిపారు. అదే వైఎస్సార్ బతికి ఉంటే రాష్ట్రం విడిపోయేది కాదన్నారు. రాష్ట్రం విడిపోవడంతో మన రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం ఏపీఎస్ ఆర్టీసీ కడప జోనల్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ రెడ్లను ఒక కులంగా చూడకూడదని, ఇతరుల సంక్షేమం కోసం రెడ్లు పాటుపడ్డారన్నారు. సమాజ హితం కోరే వారిలో మొదట రెడ్లు ఉంటారన్న విషయం అందరూ గుర్తుంచుకోవాలని చెప్పారు. అందరూ కలసికట్టుగా ఉంటూ పేదల అభ్యున్నతికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్ల సేవా సమితి సభ్యులతోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ముక్తిరామలింగేశ్వరునికి అన్నాభిషేకం



అన్నాభిషేకంలో ముక్తిరామలింగేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక రామేశ్వరంలోని శ్రీముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున సైకతలింగానికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకు మార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 9 గంటలకు సైకతలింగానికి అన్నాభిషేకం చేశారు. వేదమంత్రోచ్చారణల మధ్య శివునికి అన్నంతో అభిషేకించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాజారెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరును ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతాం



మాట్లాడుతున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

చాపాడు: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నాయకులను వేధిస్తున్న కూటమి ప్రభుత్వానికి తెలుగుదేశం పార్టీ తన అధికార సోషల్ మీడియా ఖాతాలో చేస్తున్న పోస్టులు కనిపించడం లేదా అంటూ వైఎసార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి మండిపడ్డారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా శ్రేణులను అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం, 2022లో వైఎస్ విజయమ్మ కారుకు జరిగిన ప్రమాదాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయించాడని టీడీపీ తన అధికార సోషల్ మీడియా ఖాతా నుంచి పోస్టు చేసిందన్నారు. దీనిని విజయమ్మ తీవ్రంగా ఖండించారన్నారు. ఇలాంటి పోస్టులతో వ్యక్తిత్వ హననానికి పాలుపడుతున్న వారిపై చర్యలు తీసుకుంటారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలానే పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి రాఘవరెడ్డికి పోలీసులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా రాత్రిళ్లు ఇంటికెళ్లి కుటుంబ సభ్యుల్ని బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. వర్రా రవీంద్రారెడ్డిని మహబూబ్‌నగర్‌లో అరెస్ట్ చేసినట్లు ఎల్లో మీడియా వెల్లడిస్తే వర్రా రవిని అరెస్ట్ చేయనేలేదని పోలీసు శాఖ ప్రతినిధిలా టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి మాట్లాడటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. వర్రా రవికి ఏమైనా జరిగితే దీనికి పోలీసుశాఖ, ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. తక్షణమే రవిని కోర్టుకు హాజరుపరచాలని ఆయన డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ చేస్తున్న దారుణాలపై కోర్టుల్లో ఎదుర్కోవడమే కాక ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామని తెలియజేశారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

పోరుమామిళ్ల: కడప కలెక్టరేట్ ఎదుట ఈనెల 14న జరుగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ప్రజాపోరు వాల్‌పోస్టర్లను ఆదివారం పోరుమామిళ్లలో సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజలపై రూ.18 కోట్లు విద్యుత్ బిల్లులు పెంచిందన్నారు. ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం దుర్మార్గమన్నారు. రాయలసీమలో కరువు తాండవిస్తున్నదని, కడప జిల్లాలో 33 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలన్నారు. పరిశ్రమలు పెట్టి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలివ్వాలన్నారు. పోరుమామిళ్ల చెరువుకు సాగునీరు అందిస్తే రైతులు బాగుపడతారన్నారు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్న వారికి తెలుగుగంగ నుండి పైప్‌లైన్ ద్వారా నీరు అందించాలన్నారు. రైతులను, కార్మికులను, సామాన్య ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాన్ని హెచ్చరించేందుకు ఈనెల 14న జరుగనున్న మహాధర్నాలో అన్ని వర్గాల వారు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపిచ్చారు.

వానప్రస్థానదశకు వారధి కార్తిక వనభోజనాలు



గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేస్తున్న బ్రాహ్మణసేవా సంఘం నాయకులు

బద్వేలు అర్బన్: మానవ జీవన పరిణామ క్రమంలో చివరిదైన వానప్రస్థానదశకు కార్తిక వనభోజనాలు వారధిలాంటివని బ్రాహ్మణ సేవా సంఘం కార్యదర్శి చెప్పలి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం బ్రాహ్మణసేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీశంకర్‌నగర్‌లోని శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి ఆలయ ఆవరణలో వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఏకాదశ పూర్వక రుద్రాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించి అనంతరం మహిళలకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానప్రస్థానదశలో జనజీవనం నుండి దూరంగా ఆధ్యాత్మిక చింతనతో అరణ్యాలలో జీవించడం ఎలా అనే విషయాన్ని ముందుగానే అధ్యయనం చేయడమే కార్తీక వనభోజనాల ఆంతర్యమని అన్నారు. హిందూ ధర్మంలోని ప్రతి ఆచారం వెనుక ఒక అంతరార్థం దాగి ఉంటుందని, దానిని తెలుసుకుని ప్రతిఒక్కరు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణసేవా సంఘం నాయకులు, యువజన విభాగం అధ్యక్షుడు పవన్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

అటవీ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



ప్రొద్దుటూరు క్రైం : సిబ్బందికి సందేశమిస్తున్న అటవీశాఖ అధికారులు



పోరుమామిళ్లలో..

ప్రొద్దుటూరు క్రైం: అటవీ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ప్రొద్దుటూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎం హేమాంజలి తెలిపారు. స్థానిక ఫారెస్ట్ సబ్‌డివిజన్ కార్యాలయంలో ఆదివారం అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యాలయ ఆవరణంలోని అమరవీరుల స్థూపం వద్ద అధికారులు నివాళులు అర్పించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌ఓ మాట్లాడుతూ అటవీశాఖలోని చాలా మంది ఉద్యోగులు అటవీ సంపదను కాపాడే క్రమంలో ప్రాణాలర్పించారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని అటవీసంపద, వన్యప్రాణి సంరక్షణ ధ్యేయంగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి లక్ష్మీకుమారి, సెక్షన్ ఆఫీసర్ రవిచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల అటవీశాఖ కార్యాలయంలో ఆదివారం అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం రేంజర్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. విధి నిర్వహణలో అమరులైన అటవీ ఉద్యోగులకు మౌనం పాటించి నివాళి ఘటించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తన బాధ్యతతో పాటు కుటుంబ బాధ్యత నిర్వర్తించాలని, విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారులు, బీటు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణ



ఫుట్‌పాత్‌ను ఆక్రమించి తోపుడు బండ్ల వ్యాపారులకు అద్దెకు ఇచ్చిన వ్యాపారి

ప్రొద్దుటూరు : స్థానిక శివాలయం వీధిలోని శ్రీరాములపేట ఎంట్రన్స్ వద్ద వ్యాపారులు ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. శ్రీరాములపేట నిత్యం వ్యాపార సముదాయాల ప్రభావం వల్ల జన సందడిగా ఉంటుంది. ఫుట్ పాత్‌పై వ్యాపారాలు సాగిస్తుండటంతో రోడ్డు కుంచించుకుపోయింది. షాపింగ్ గది యజమాని మున్సిపాలిటీకి చెందిన ఫుట్ పాత్ స్థలాన్ని ఆక్రమించి తోపుడు బండ్ల వ్యాపారులకు అద్దెకు ఇచ్చాడు. దీంతో వీధిలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో ఇక్కడ ఓ వ్యక్తి బజ్జీల వ్యాపారం చేస్తుండగా, అప్పటి మున్సిపల్ కమిషనర్ రాధ రోడ్డు ఆక్రమణల కింద ఆ వ్యాపారాలను తొలగించారు.

దేవాంగ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

దేవాంగ సంక్షేమసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వుట్టి నాగశయనం



మాట్లాడుతున్న వుట్టి నాగశయనం

ప్రొద్దుటూరు కల్చరల్: దేవాంగుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వుట్టి నాగశయనం పేర్కొన్నారు. స్థానిక దేవాంగ కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ స్టేట్ హ్యాండ్‌లూమ్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా డాక్టర్ సజ్జ హేమలతను నియమించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. చేనేత వర్గంలో 18 ఉపకులాలు ఉన్నాయని వాటిలో దేవాంగులు ఒకరన్నారు. రాష్ట్రంలో దాదాపు 18 లక్షల మంది దేవాంగులు ఉన్నారన్నారు. గత ప్రభుత్వం కూడా దేవాంగులకు ప్రత్యేకంగా గుర్తించి ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి దేవాంగుల అభ్యున్నతికి సహకారం అందించిందన్నారు. కాని ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో దేవాంగులకు ప్రాధాన్యత లభించడం లేదన్నారు. చేనేత వర్గానికి చెందిన ఒకే కులానికే ప్రాధాన్యత ఇస్తూ టీటీడీ బోర్డు మెంబరుతో పాటు వివిధ కార్పొరేషన్‌లలో స్థానం కల్పించి దేవాంగులను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాంగ కార్పొరేషన్ ఉందో లేదో అని దేవాంగులు ఆందోళన చెందుతున్నారన్నారు. దేవాంగ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి పలు నామినేటెడ్ పదవుల్లో తమకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ దేవాంగ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు రాగ నరసింహులు, అసోసియేట్ మెంబర్లు మచ్చా వెంకట సుబ్బరాయుడు, దేవాంగ కళ్యాణ మండప అధ్యక్షుడు ఆర్‌సి సుబ్రహ్మణ్యం, సంఘం గౌరవాధ్యక్షులు కాటం బ్రహ్మయ్య, సాధు మనోహర్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

మైదుకూరు: విద్యుత్ చార్జీల పెంపును, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ సర్దుబాటు చార్జీల రూపంలో కూటమి ప్రభుత్వం ఏకకాలంలో రూ.18వేల కోట్లకు పైబడి పెంచాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతన్న ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు, వివిధ వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చకుండా గోరుచుట్టుపై రోకలిపోటులా 80 శాతం ఉన్న రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజలపై విద్యుత్‌చార్జీల పెంపు తీవ్రమైన ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని, స్మార్ట్ విద్యుత్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. లేనిపక్షంలో సమీప భవిష్యత్తులో జరుగు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వంలోని పార్టీలను రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజలు చిత్తుగా ఓడిస్తారని ఈ సందర్భంగా హెచ్చరించారు.

బకాయిలు చెల్లించకుండా కాలయాపన

పోరుమామిళ్ల: ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకుండా కాలయాపనతోనే సరిపెడతారా? అంటూ ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి పి.రమణారెడ్డి, రాష్ట్ర కమిటీ కన్వీనర్ సుబ్రమణ్యం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిడ్పీ పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ తదితర బిల్లుల చెల్లింపులో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తున్నామన్నారు. ఉద్యోగులు తమ జీతాల నుంచి ప్రతినెలా మినహాయించి ఖాతాల్లో పొదుపు చేసుకున్న సొమ్మును నెలల తరబడి చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. 12వ పీఆర్సీలో జాప్యం, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్‌గా ఇర్ఫాన్‌బాషా

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ కో ఆర్డినేటర్‌గా సికిలిగిరి ఇర్ఫాన్‌బాషా నియమితులయ్యారు. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా 35 అసెంబ్లీ నియోజకవర్గాలకు కో ఆర్డినేటర్లను ప్రకటించారు. ఇర్ఫాన్‌బాషా వైఎస్సార్‌సీపీ తరపున ప్రొద్దుటూరు మున్సిపాలిటి కౌన్సిలర్‌గా గెలుపొందారు. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ముందు ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు.

నియామకం

చాపాడు: మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో–ఆర్డినేటర్ చాపాటి రామసుధాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకూ ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ షాపుపై కేసు నమోదు

చాపాడు: మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలోని దళితవాడలోని చౌక దుకాణంపై 6–ఏ కేసు నమోదు చేసినట్లు ప్రొద్దుటూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున తెలిపారు. దళితవాడలో చౌక దుకాణంలో తనిఖీలు నిర్వహించగా 10 క్వింటాళ్ల బియ్యం, 25 ప్యాకెట్ల చక్కెర తక్కువగా ఉన్నాయని వీటికి సరైన లెక్కలు చూపకపోవటంతో కేసు నమోదు చేసినట్లు డీటీ తెలియజేశారు.

నిరుపేదలకు సరుకుల పంపిణీ



గోధుమ పిండిని పంపిణీ చేస్తున్న రామకృష్ణారెడ్డి

కాశినాయన: మండలంలోని వరికుంట్ల ఎస్టీకాలనీలోని పేదలకు వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి ఆదివారం కాలనీ వాసులకు గోధుమపిండి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన వెంకటసాయికుమార్, స్వప్న దంపతుల కుమార్తె సాయికృతి పుట్టినరోజు సందర్భంగా రూ.10 వేలు విలువ చేసే గోధుమపిండిని ఒక్కో కుటుంబానికి 5 కిలోల చొప్పున 25 కుటుంబాలకు పంపిణీ చేశామన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

రాజుపాళెం: ఈ నెల 14వ తేదీ నుంచి 20 వరకు రాజుపాళెంలోని గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి ఎస్.ప్రతాపుడు పేర్కొన్నాడు. ఆయన రాజుపాళెంలోని గ్రంథాలయంలో ఆదివారం మాట్లాడుతూ 14వ తేదీ నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. 14వ తేదీన బాలల దినోత్సవం, 15న పుస్తక పఠనము, 16న విద్యార్థులకు గ్రంథాలయ ఆవశ్యకత, చిత్రలేఖనం, దేశనాయకుల చిత్రపటం వద్ద పోటీ పరీక్ష, 17న రాష్ట్ర స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడం, 18న గ్రంథాలయ ఉద్యమకారులను పూలమాలతో సత్కారం, 19న మహిళా దినోత్సవం, 20న వారోత్సవాల ముగింపు కార్యక్రమం గెలుపొందిన వారికి బహుమతులను ఇస్తామన్నారు. పాఠకులతో పాటు గ్రామస్తులు పాల్గొనాలని, పోటీల్లో పాల్గొనేవారంతా పేర్లను నమోదు చేసుకోవాని ఆయన చెప్పారు.

ఆర్థిక సాయం



నాగేశంకు నగదు అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

అట్లూరు: వేమలూరు వీఆర్ఏ నల్లిపోగు నాగేశంకు అట్లూరు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి రూ.40 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. రాష్ట్ర వీఆర్ఏ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం తీవ్ర అనారోగ్యంతో తిరుపతిలోని రష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈయన అట్లూరు మండలం వేమలూరు నివాసి. ప్రభాకర్‌రెడ్డి ఆదివారం తిరుపతిలోని ఆస్పత్రికి వెళ్లి రూ.40 వేలు నగదు అందజేశారు.

వాహనాల తనిఖీ

అట్లూరు: మండల పరిధిలోని ఎస్.వెంకటాపురం కాలనీ వద్ద ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. రికార్డులు లేని, హెల్మెట్ ధరించని వ్యక్తులకు రూ.2550లు జరిమానా విధించారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని గాయాలు

రాజుపాళెం: మండలంలోని కొర్రపాడు–గోపవరం గ్రామాల మధ్యలో ఆదివారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా... ప్రొద్దుటూరు నుంచి మండలంలోని వెలవలి గ్రామానికి వెళుతున్న సుబ్రమణ్యం బస్సును ఓవర్ టెక్ చేసే సమయంలో ఎదురుగా వస్తున్న రాజు ద్విచక్ర వాహనాన్ని ప్రమాదవశాత్తు ఢీకొంది. రాజు దంపతులు వెల్లాల బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న తమ పిల్లలను చూసి ప్రొద్దుటూరులోని ఇంటికి వెళుతున్న సమయంలో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో గాయపడిన సుబ్రమణ్యం, రాజును ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఆధార్ లింక్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

బద్వేలు అర్బన్: బ్యాంక్ అకౌంట్లకు ఆధార్‌కార్డు లింక్ (ఎన్‌పీసీఐ) కోసం పోస్టాఫీసు ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిదారులకు నేరుగా బ్యాంకు అకౌంట్లకు నగదు జమ కావాలంటే తప్పనిసరిగా బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్‌కార్డు లింక్ అయి ఎన్‌పీసీఐ యాక్టివ్‌లో ఉండాలని, ఇందుకోసం పోస్టాఫీసు ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుండి తొట్టిగారిపల్లె, కుమ్మరికొట్టాలు, భావనారాయణనగర్, గుంతపల్లె, సురేంద్రనగర్, వెంకటయ్యనగర్, దూదేకులవీధి, అబ్బురాతివీధి సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నారని, ప్రజలు ఆధార్‌కార్డు, మొబైల్ నెంబర్ తీసుకుని వచ్చి లింక్ చేయించుకోవాలని కోరారు.

ఎస్ఆర్ ప్రతాప్‌రెడ్డికి ఆత్మీయ సత్కారం



ఎస్ఆర్ ప్రతాప్‌రెడ్డిని సత్కరిస్తున్న వైవీయూ వైస్ చాన్స్‌లర్ కృష్ణారెడ్డి తదితరులు

దువ్వూరు (మైదుకూరు): దువ్వూరు మండలం చల్లబసాయపల్లెకు చెందిన గ్రామీణ చైతన్య గ్రంథాలయం వ్యవస్థాపకుడు, హాలిక కవి ఎస్ఆర్ ప్రతాప్‌రెడ్డికి ఆదివారం సీపీ బ్రౌన్ జయంతి ఉత్సవాల్లో ఆత్మీయ సత్కారం చేశారు. కడపలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించిన బ్రౌన్ 226వ జయంతి ఉత్సవాల్లో యోగివేమన యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, సీపీ బ్రౌన్ పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ తదితరులు ఎస్ఆర్ ప్రతాప్‌రెడ్డికి శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

నిరుద్యోగులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్: నిరుద్యోగులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి పేర్కొన్నారు. స్థానిక గీతాంజలి హైస్కూల్‌లో ఆదివారం నాగార్జున ఐటీఐ కళాశాల ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పించాలని ఉద్దేశంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. అందివచ్చిన అవకాశాలని ఉపయోగించుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. మేళాలో నాన్ ఐటీ, ఐటీ కంపెనీలు పాల్గొనగా 310 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు కంపెనీ ప్రతినిధులు ఎంపిక చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు మల్లెల లక్ష్మీప్రసన్న, భారతి, ప్రిన్సిపాల్ సుబ్బారావు, పాఠశాల కరస్పాండెంట్ శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని డాక్టర్ టీడీ వరుణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక హోమస్‌పేట ప్రాథమిక పాఠశాలలో ఆదివారం బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో గండికోటపై చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అంతర్గతంగా దాగివున్న నైపుణ్యాలు, సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడుతాయన్నారు. పోటీల్లో 200 మంది విద్యార్థులు పాల్గొని గండికోట చిత్రాన్ని గీశారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతి, జ్ఞాపిక, సర్టిఫిట్‌లను అందజేశారు. బాలోత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు గుర్రాల గోపాల్, ఉపాధ్యక్షుడు నాగమునిరెడ్డి, కార్యదర్శి లక్ష్మీరాజ, శివరాం, రవి, గోపీనాథ్, వెంకటేశ్వర్లు, యోహాన్, బాలకృష్ణ, నాగరాజు, సుందరం, డేవిడ్ పాల్గొన్నారు.